క్లుప్తంగా

ఆలయ అభివృద్ధి పనులు వేగవంతం



పనులను పరిశీలిస్తున్న చైర్మన్ శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం అనుబంధ శ్రీమార్కండేయ తీర్థం ఆలయ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఆయన ఆలయ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడు తూ పదిరోజుల్లో కుంభాభిషేకం నిర్వహిస్తున్న నేపథ్యంలో పనులను నాణ్యతగా వేగవంతంగా చేయాలన్నారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



ఏర్పేడు: మండలంలోని అంజిమేడు పంచాయతీ పోతుమానిగుంట ఎస్టీ కాలనీలో శనివారం ప్రజా సాధికారిక సమితి ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. 28 కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. సమితి కార్యదర్శి దేవేంద్ర, ప్రజాప్రగతి ట్రస్ట్ మండల కన్వీనర్ చంద్రశేఖర్, సీహెచ్ఓ సౌజన్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

ఏర్పేడు: మండలంలోని మేర్లపాకలో శనివారం సర్పంచ్ గంగాధరం ఆధ్వర్యంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. లో ఓల్టేజీతో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఇళ్లల్లో లైట్లు, ఫ్యాన్‌లు, టీవీలు, ఫ్రిజ్‌లు తదితర పరికరాలు పనిచేయలేదు. గ్రామస్తులు సమస్యను సర్పంచ్‌కు విన్నవించగా వెంటనే ఎస్పీడీసీఎల్ అధికారులతో మాట్లాడి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

నాణ్యమైన భోజనం పెట్టాలి



భోజన పదార్థాల నాణ్యతను పరిశీలిస్తున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ: జగనన్న గోరుముద్ద మధ్యాహ్న పథకంలో రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు పెట్టాలని వంట నిర్వాహకులకు మండల విద్యాశాఖాధికారి మునిసుబ్రమణ్యం తెలిపారు. ఆయన శనివారం మండలంలోని కాటూరు, బుచ్చినాయుడుకండ్రిగ ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. పదార్థాలు రుచి చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని అందించాలని తెలిపారు.

గుంతలు తేలిన జంబుగోళం రోడ్డు



గుంతలమయంగా జంబుగోళం రోడ్డు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని జంబుగోళం, జీఎన్‌కండ్రిగ, ఆర్‌అనంతాపురం, పూసలపల్లె గ్రామాలకు వెళ్లే రోడ్డు తారురోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలమయమై అధ్వానంగా ఉంది. గ్రామస్తులు, వాహనాదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కేటీరోడ్డు నుంచి జంబుగోళం గ్రామానికి నాలుగు కిలోమీటర్లు ఆర్‌అండ్‌బీ తారురోడ్డు ఉంది. రోడ్డు వెంబడి జీఎన్‌కండ్రిగ, ఆర్‌అనంతాపురం, పూసలపల్లె, గ్రామాలున్నాయి. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు ఆర్‌అండ్‌బీ అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

నేత్రపర్వంగా లక్ష్మీనరసింహుని కల్యాణం



రాపూరు: పెంచలకోన క్షేత్రంలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం అభిషేకం, సుప్రభాతం, పూలంగిసేవ చేశారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను నిత్యకల్యాణ మండపంలో కొలువుదీర్చి శోభాయమానంగా అలంకరించి, శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ఊంజల్‌సేవ నిర్వహించారు.

రుయా తరహాలో శ్రీకాళహస్తి ఆస్పత్రి

- జిల్లా ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తాం
- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి
- రూ.11కోట్లతో ఆధునికీకరించిన వివిధ విభాగాల ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: తిరుపతి రుయా తరహాలో శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రిని అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆస్పత్రిలో రూ.11 కోట్లతో ఆధునికీకరించిన పలు విభాగాలను ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నాబర్డు నిధులు రూ.12కోట్లతో అత్యవసర విభాగం, కాన్పుల వార్డు, చిన్నపిల్లల వార్డు, బాలింతల వార్డు, సూపరింటెండెంట్ కార్యాలయం, ఎక్సరే ల్యాబ్‌లు, ఫార్మసీ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వంద పడకల ఆస్పత్రిని జిల్లా స్థాయి ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజారోగ్యానికి ముఖ్యమంత్రి పెద్దపీట వేశారని తెలిపారు. జనరేటర్, ఇన్వర్టర్స్, శుద్ధజల ప్లాంటు ఏర్పాట్లు చేశామన్నారు. దాతల నుంచి లభించిన ఆక్సిజన్ ప్లాంట నుంచి అన్ని పడకల వద్దకు పైపులు ఏర్పాటు చేసి ఏవిధమైన ఇబ్బంది లేకుండా చూస్తామని తెలిపారు. పరిసర కర్మాగారాల కార్మికులు, పేదప్రజలు ఈ ఆస్పత్రికి వస్తున్నారని వారికి ఉత్తమ సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. పక్క నియోజకవర్గాల నుంచి కూడా ఎక్కువ మంది రోగులు ఇక్కడికి వస్తున్నారని జిల్లాస్థాయికి పెంచుకుంటే మరిన్ని సేవలు అందించవచ్చని తెలిపారు. ఆస్పత్రి చూట్టూ గ్రీనరీ ఏర్పాటు చేస్తామన్నారు. గతంలో రోగులతో పాటు వచ్చేవారు భోజనం లేక ఇబ్బంది పడేవారని నేడు ఆలయం తరఫున ఎంతమంది ఉంటే అంతమందికి అందుతోందని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తెలిపారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ప్రభుత్వం నుంచి అన్ని విధాల సహకారం

డీసీహెచ్ఎఫ్ ఆనందమూర్తి మాట్లాడుతూ ఈ ఆస్పత్రికి నాబర్డు రూ.12కోట్లు నిధులు రావడానికి ఎమ్మెల్యే కృషి ఎంతో ఉందన్నారు. తిరుపతి జిల్లా ఏర్పడిన తరువాత శ్రీకాళహస్తి ఆస్పత్రి రెండవ పెద్ద ప్రభుత్వాస్పత్రిగా ఉందన్నారు. ప్రభుత్వం నుంచి అన్ని విధాల సహకారం అందుతోందన్నారు. ఆంధ్ర ప్రదేశ్ మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఈఈ సురేష్ మాట్లాడుతూ అత్యవసర విభాగాలను దగ్గరుండి నిర్మించినట్లు తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఎక్కువమంది వైద్యులు ఆస్పత్రిలో అందు బాటులో ఉన్నారని, సిబ్బంది కొరత లేదన్నారు. ఎమ్మెల్యే ప్రభుత్వాస్పత్రికి సంబంధించి ఏ సమస్యను తీసుకెళ్లినా వెంటనే స్పందించి కావాల్సిన సదుపాయాలను అందిస్తున్నారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని సన్మానించారు. ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బందికి చందమామల కోటయ్య ఆధ్వర్యంలో జ్ఞాపికలు అందజేశారు. శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ ముఖ్య నేతలు గుమ్మడి బాలకృష్ణయ్య, పగడాల రాజు, భాస్కర్, సి.జయగోపాల్, పీఎం చంద్ర, శివకుమార్‌యాదవ్, పఠాన్ ఫరీద్, డాక్టర్ శంకర్, మల్లినాయుడు, మునిరెడ్డి, యానాదయ్య, జయరామయ్య, పసలకుమార్, సాయి రవి, సునీతాసింగ్, ప్రమీలమ్మ, శ్యామల, లక్ష్మి, పద్మ, ధనలక్ష్మి, మునిరత్నం, నరసారెడ్డి, బాబు, కూనాటి రమణయ్యయాదవ్, పసల కృష్ణయ్య, మహబూబ్‌బాషా, గణేష్, బత్తిశెట్టి, శంకర్, రమేష్ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ఊంజల్ సేవ



ఊంజల్ సేవలో ఉభయ నాంచారులతో స్వామివారు

నారాయణవనం: టీటీడీ అనుబంధంలో ఉన్న ప్రముఖ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ఊంజల్ సేవ నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. సాయంత్రం కైంకర్యాలు పూర్తి అయిన అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా కొలువుదీర్చి తిరుచ్చి వాహనంపై అధిష్టింప జేసి ఊంజల్ మండపానికి వేంచేపు చేశారు. అనంతరం గంట పాటు ఊయ్యాల సేవలో సేదతీరుతున్న ఉత్సవ మూర్తులను భక్తులు వీక్షించి తరించారు. తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారి నాగరాజు, అర్జితం అధికారి భరత్, జమేదార్ రాజశేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

టైలరింగ్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు

పుత్తూరు: పట్టణంలోని ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో స్వయం ఉపాధి కోసం టైలరింగ్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులు రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ పాస్, ఏదైనా డిగ్రీ కలిగిన యువతీ యువకులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 30వ తేదీ లోపు కళాశాలలోని స్కిల్ హబ్ లో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం అభ్యర్థులు ఆధార్ కార్డు, మార్క్స్ లిస్టు జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు సైజు ఫోటో తీసుకురావాలని చెప్పారు. శిక్షణ పొందిన వారికి స్కిల్ ఇండియా సర్టిఫికెట్ ఇవ్వడంతో పాటు ఉపాధి అవకాశాలను కల్పిస్తామని తెలిపారు. వివరాలకు 63009 54441 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి



సీఎల్ఎన్‌పల్లిలో మాట్లాడుతున్న ఏడీఏ

వరదయ్యపాళెం: సాగు చేసిన పంటకు సంబంధించిన వివరాలు రైతులు ఈ-పంట నమోదు చేసుకోవాలని సత్యవేడు వ్యవసాయశాఖ ఏడీఏ సుబ్రమణ్యం సూచించారు. శనివారం మండలంలోని సీఎల్ఎన్‌పల్లె, కళత్తూరు గ్రామాల్లో ఆయన పర్యటించి, ఈ-పంట ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే ఈ-పంటలో నమోదు చేస్తున్న వివరాలను ఆయన పరిశీలించారు. ఏఓ సుహర్‌లత, ఏఈఓ ప్రవీణ్, వ్యవసాయ సహాయకులు పవన్, జ్యోతి, రెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏఓ భారతి

బుచ్చినాయుడుకండ్రిగ: కనమనంబేడు గ్రామంలో మినుము పంటల్లో వచ్చే తెగుళ్ల నివారణపై రైతులకు శనివారం మండల వ్యవసాయాధికారి భారతి అవగాహన కల్పించారు. మినుము పంటలో పల్లాకు తెగులుపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. లేత ఆకులో పసుపు రంగు మచ్చలు ఏర్పడి మొక్కలు ఎండి పోతాయని, తెగులు నివారణకు అసిఫేట్ గ్రాము, లేదా మోనోక్రోటోపాస్ 16 మిల్లీ లీటరు నీటిలో పిచికారీ చేయాలని తెలిపారు. వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వన్నెరెడ్ల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

ఏర్పేడు: శ్రీకాళహస్తి నియోజకవర్గ వన్నెరెడ్ల అభివృద్ధికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కృషిచేస్తున్నట్లు ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం తెలిపారు. శనివారం రాత్రి మండలంలోని ఇసుకతాగేలి గ్రామంలో వన్నెరెడ్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచనల మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనను ఎమ్మెల్సీగా చేసినట్లు వివరించారు. సీఎం జగనన్న ప్రభుత్వంలో బీసీలకు సమన్యాయం జరుగుతోందన్నారు. చంద్రబాబు హయాంలో బీసీలపై వివక్ష జరిగిందని గుర్తుచేశారు. మరింత అభివృద్ధి కోసం మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. నాయకులు వడ్లతాంగళ్ బాలాజీ ప్రసాద్‌రెడ్డి, మునిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మునిరత్నం రెడ్డి, దామోదరంరెడ్డి పాల్గొన్నారు.

హెల్త్ క్లినిక్‌లతో మెరుగైన వైద్యం



మాట్లాడుతున్న డీపీఎం శ్రీనివాసరావు

నారాయణవనం: గ్రామీణ ప్రాంతాల్లో పలు రకాల మందులు, వైద్య పరీక్షలు ఒక్క ఆంధ్ర ప్రదేశ్‌లో మాత్రమే వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌ల ద్వారా పేద ప్రజలకు ఉచితంగా అందుతున్నాయని జాతీయ ఆరోగ్య మిషన్ డీపీఎం శ్రీనివాసరావు తెలిపారు. శనివారం మండలంలోని తుంబూరు హెల్త్ క్లీనిక్‌ను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు చేశారు. రికార్డులను, వైద్య పరీక్షల వివరాలు, మందులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గర్భిణులకు, కిషోర బాలికలకు, పాఠశాల విద్యార్థులకు నిర్వహిస్తున్న టీబీ ప్రరీక్షలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ హెల్త్ క్లీనిక్‌ల ద్వారా మెరుగైన ప్రాథమిక వైద్యాన్ని పేదలకు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. పీహెచ్‌సీ వైద్యులు దర్శిత్‌రాజ్, రాఘసుధ, సీహెచ్‌వో శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

విస్తారంగా అంతర పంటల సాగు



మామిడి తోటలో అంతర పంటగా మిరప

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని రైతులు మామిడి తోటల్లో మిరప, మినుము, వేరుశనగను అంతర పంటలుగా సాగు చేస్తున్నారు. మండలంలో 180 ఎకరాల్లో మామిడి తోటల్లో మిరప, మినుము, వేరుశనగ అంతర పంటలుగా సాగులో ఉన్నాయి. మామిడి తోటలకు వాడే నీటితోనే మిరప, మినుము, వేరుశెనగ పంటలను పండించ వచ్చని, పెట్టుబడి ఖర్చు తక్కువవుతందని, విద్యుత్ ఆదా అవుతుందని రైతులు చెబుతున్నారు. పంటల దిగుబడి బాగా వస్తుందని, మిరప, మినుము, వేరుశెనగ పంటలకు వాడే ఎరువులు, నీటి వల్ల మామిడి చెట్లకు పోషకాలు అందుతాయని పేర్కొంటున్నారు. మామిడి తోటల్లో ఐదు సంవత్సరాలు వరకు అంతర పంటలను సాగు చేసుకోవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.



మామిడి తోటలో వేరుశనగ పంట

తప్పిపోయిన చెన్నై వాసులు సురక్షితం



దారి తప్పిన చెన్నై వాసులు

నాగలాపురం: మండలంలోని భూపతీశ్వరకోన జలపాతం వద్దకు విహార యాత్రకు వచ్చి దారి తప్పిన చెన్నై వాసులను పోలీసులు రక్షించారు. చెన్నై ఆవడికి చెందిన ఐదుగురు స్నేహితులు శుక్రవారం విహారయాత్రకు వచ్చారు. అటవీ ప్రాంతంలో ఉన్న కోనలోకి వెళ్లి దారి తెలియక తప్పిపోయారు. వెంటనే డైల్ 100కు కాల్ చేసి సమాచారం అందించారు. వెంటనే ఎస్ఐ టి.ఓబయ్య సిబ్బందితో అడవిలోకి వెళ్లి రాత్రి ఒంటి గంట వరకు గాలించి యువకులను రక్షించారు. దారి తప్పిన వారిలో నలుగురు యువకులతో పాటు ఒక యువతి ఉంది. వారిని సురక్షితంగా ఇంటికి పంపారు.

మహిళలు అక్షరాస్యులైతేనే సమాజ ప్రగతి



సమావేశంలో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ మునిరత్నం

శ్రీకాళహస్తి: మహిళలు అక్షరాస్యులైతేనే సమాజం త్వరితగతిన ప్రగతి సాధిస్తుందని ఎస్ఓఎస్ కోఆర్డినేటర్ మునిరత్నం అన్నారు. జాతీయ కుటుంబ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజా సాధికారిక ట్రస్టు, ఎస్ఓఎస్ విలేజ్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి మండలం యల్లంపల్లెలో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రతి ఒక్కరు చదువుకోవడం ద్వారా వందశాతం అక్షరాస్యత సాధించాలన్నారు. బాలకార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ప్రధానంగా ప్రతి ఇంట్లో మహిళలు అక్షరాస్యులై ఉంటే ఆ కుటుంబమే కాకుండా సమాజమే చైతన్యవంతమవుతుందని చెప్పారు. ఏ గ్రామంలోనైనా వయోజనులు సాయంత్రం వేళల్లో చదువుకోవడానికి ఆసక్తి కనబరిస్తే తమ సంస్థలు విద్యాబోధనలకు అవసరమైన సౌకర్యం కల్పిస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాలబాలికలకు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ప్రజా ప్రగతి ట్రస్టు మండల కోఆర్డినేటర్ చంద్రశేఖర్, ప్రజా సాధికారిక సంస్థ రిసోర్స్ పర్సన్ సురేష్, కో ఆర్డినేటర్ జీనాత్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఫైనల్స్‌కు సత్యవేడు, కేవీబీపురం జట్లు





పిచ్చాటూరుపై గెలిచిన కేవీబీపురం జట్టు, బీఎన్‌కండ్రిగపై విజయం సాధించిన సత్యవేడు జట్టు

సత్యవేడు: ఆడుదాం-ఆంధ్ర నియోజకవర్గస్థాయి క్రికెట్ పోటీల్లో కేవీబీపురం, సత్యవేడు మండల జట్లు సెమీఫైనల్స్‌లో విజయం సాధించి ఫైనల్స్ చేరాయి. తొలుత కేవీబీపురం, పిచ్చాటూరు జట్ల మధ్య పోటీ జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన కేవీబిపురం జట్టు 10 ఓవర్లలో 99 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ లోకి దిగిన పిచ్చాటూరు జట్టు 9 ఓవర్లలో 61 పరుగులు చేసి ఆల్ అవుట్ అయ్యింది. అలాగే సత్యవేడు, బుచ్చినాయుడుకండ్రిగ జట్ల మధ్య పోటీ జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన సత్యవేడు జట్టు 10 ఓవర్లలో 83 మూడు పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన బుచ్చినాయుడు కండ్రిగ జట్టు63 పరుగుకు ఆల్‌అవుట్ అయ్యింది. ఆదివారం ఫైనల్స్‌లో సత్యవేడు, కేవీబీపురం జట్లు తలపడనున్నాయి. అంపైర్లుగా పీడీలు మురళి, కిషోర్‌కుమార్, సురేంద్ర, మణి, నాగరాజు, లోకనాథం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటించాలి



విద్యార్థులతో రవాణాశాఖాధికారుల ర్యాలీ

శ్రీకాళహస్తి: వాహనదారులు రహదారి నిబంధనలు పాటిస్తే ఎలాంటి ప్రమాదాలు జరగవని ఎంవీఐ ఈ.దామోదరనాయుడు తెలిపారు. పట్టణంలో శనివారం ఎంవీఐ ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని విక్రమ్ కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ తప్పిదం కారణంగానే అధిక శాతం రహదారి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. తగిన జాగ్రత్తలు పాటించి రహదారి ప్రమాదాలను నివారించాల్సిన అవసరం ఉందని తెలిపారు. మితిమీరిన వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, వాహనం నడిపే సమయంలో సెల్‌ఫోన్‌లో వాడడం కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ద్విచక్ర వాహనదారులందరూ హెల్మెట్, కారు ప్రయాణికులు సీటుబెల్టును ధరించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. రహదారి జాగ్రత్తలను వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. రవాణా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు పురస్కారం



కలెక్టర్ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న డాక్టర్ విజయలక్ష్మి

శ్రీకాళహస్తి: ఉత్తమ సేవలు అందించి శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మికి ప్రశంసాపత్రం లభించింది. రోగుల హెల్త్ రికార్డులను ఆన్‌లైన్‌లో డిజిటలైజేషన్ చేయడంలో ఉత్తమ ప్రతిభ కనబరచినందుకు ఆమెకు ప్రశంసాపత్రం లభించింది. శుక్రవారం తిరుపతి జిల్లా కేంద్రంలో జరిగిన గణతంత్ర దిన వేడుకల్లో కలెక్టర్ వెంకటరమణారెడ్డి చేతులమీదుగా ప్రసంశాపత్రం అందుకున్నారు.

చెంగాళమ్మ ఆలయానికి రూ.1.28 కోట్ల ఆదాయం

సూళ్లూరుపేట: పట్టణంలోని చెంగాళమ్మ ఆలయంలో దుకాణాల వేలం పాటల ద్వారా రూ.1,28,76,000 కోట్ల ఆదాయం వచ్చిందని దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు, ఆలయ ఈఓ వెంకట శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆలయంలో వివిధ దుకాణాలను నిర్వహణ హక్కుల కోసం 2024-25 ఆర్థిక సంవత్సరానికి శనివారం వేలం పాటలు నిర్వహించారు. ఈ వేలం పాటల్లో ఆలయానికి రూ.1,28,76,000 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు.

కండలేరులో 12.157 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 12.157 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 160 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ కాలువకు 360 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

16న తిరుచానూరులో రథసప్తమి

తిరుపతి(అలిపిరి): వచ్చే నెల 16వ తేదీన తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఈఓ ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. రథసప్తమి పర్వదినం సందర్భంగా అమ్మవారు ఏడు వాహనాలపై ఊరేగి భక్తులను అనుగ్రహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 7.15 నుంచి 8.15 గంటల వరకు సూర్యప్రభ వాహనం, 8.45 నుంచి 9.45 గంటల వరకు హంస వాహనం, ఉదయం 10.15 నుంచి 11.15 గంటల వరకు అశ్వ వాహనం, ఉదయం 11.45 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు గరుడ వాహనంపై విహరించి భక్తులను కటాక్షించనున్నారు. మధ్యాహ్నం 1.15 నుంచి 2.15 గంటల వరకు చిన్నశేష వాహనం, సాయంత్రం 6 నుంచి రాత్రి 7 గంటల వరకు చంద్రప్రభ వాహనం, రాత్రి 8.30 నుంచి 9.30 గంటల వరకు గజ వాహనంపై దర్శనమిస్తారన్నారు. సాయంత్రం 3.30 నుంచి 4.30 గంటల వరకు శ్రీకృష్ణస్వామివారి ముఖ మండపంలో అమ్మవారి స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహిస్తారని తెలిపారు. ఈసందర్భంగా ఆరోజు ఆలయంలో అర్జిత సేవలు రద్దుచేసినట్లు తెలిపారు. అదే విధంగా తిరుచానూరులోని శ్రీ సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో ఉదయం 6 నుంచి 7 గంటల వరకు స్వామివారు అశ్వవాహనాన్ని అధిష్టించి భక్తులకు దర్శనమివ్వనున్నారు.